క్లుప్తంగా

నేడు ఆలయ భూముల కౌలు వేలం

నందిగామ: జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామాల్లోని భవాని ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన భూములు నందిగామ మండలం లోని పెద్దవరం, కంచల గ్రామాల్లో ఉన్నాయి. ఆ భూములకు ఆయా గ్రామాల్లో మంగళవారం బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దవరంలోని 29.41 ఎకరాల భూమికి చెరువు కొమ్ముపాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 11 గంటలకు, కంచల గ్రామంలోని 11.17 ఎకరాల భూమికి గ్రామంలోని శివాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల రైతులు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం



లింగగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కోదండ రామాలయానికి సోమవారం పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కర్ల రామారావు, ఉమాదేవి కుటుంబ సభ్యులు రూ.2.50 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. విరాళం నగదును ఆలయంలోని మూల విరాట్ విగ్రహాల ఏర్పాటుకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు కర్ల కోటీశ్వరరావు, మాదల రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రూ.1.50 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టామని, ఈనెల 31న ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం



మక్కపేట(వత్సవాయి): ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 600 గాను 559 మార్కులు సాధించిన విద్యార్థిని పల్లెబోయిన సుమన్యను సోమవారం సచివాలయంలో సిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనగాల రమేష్ మాట్లాడుతూ నాడు నేడు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేకదృష్టి పెడుతున్నారని, దానికనుగుణంగా విద్యార్థులు చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొమరగిరి సంక్రాంత్, వీఆర్వో జి.స్వామి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

నందిగామ: రైతులకు అండగా ప్రభుత్వం నిలబడుతోందని సహకార సంఘ అధ్యక్షుడు లగడపాటి వీరయ్య అన్నారు. మండలంలోని కొణతమాత్మకూరు, దాములూరు గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో దగా కాకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యం నాణ్యతను బట్టి క్వింటా రూ.2060 కి కొనుగోలు చేస్తారన్నారు. రైతుల వద్ద నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కొణతమాత్మకూరు సర్పంచ్ మేడా కోటేశ్వరరావు, రైతు భరోసా కేంద్రం ఇంచార్జ్ శివ గోపి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్డీఓ స్పందనలో 11 అర్జీలు

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాల నుంచి మొత్తం 11 అర్జీలు అందాయని కార్యాలయ ఏవో రాజ్ కుమార్ తెలిపారు. వాటిలో అధికంగా రెవెన్యూకు సంబంధించి 8, సివిల్ సప్లయి, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున అందాయన్నారు.

ప్రవల్లిక కుటుంబానికి న్యాయం చేయాలి

వత్సవాయి: అనుమానాస్పదస్థితిలో బావిలో పడి మరణించిన తుంగ ప్రవల్లిక కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయకర్త మందా వెంకటేశ్వరరావుమాదిగ, నియోజకవర్గ కన్వీనర్ మాతంగి దావీదు సోమవారం డిమాండ్ చేశారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్ల దళిత బాలికపై లైంగికంగా దాడిచేసి చంపి బావిలో పడేశారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి వారికి శిక్షపడేలా చేయాలన్నారు. ఈమేరకు సీఐ జానకీరామ్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ యంగ్రాతి కోటేశ్వరరావు, కోకన్వీనర్ జిల్లేపల్లి రమాకాంత్, మండల నాయకులు మాగి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

లక్ష్మయ్య వాగుపై వంతెనకు శంకుస్థాపన

- నాలుగు దశాబ్దాల సమస్యకు పరిష్కారం
- ఐదు గ్రామాల ప్రజల కష్టాలకు విముక్తి మార్గం
- రూ.1.5 కోట్ల నిధులు మంజూరు చేసిన సీఎం జగన్
- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు వెల్లడి



చెవిటికల్లులో లక్ష్మయ్య వాగు నిర్మాణపనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చెవిటికల్లు(కంచికచర్ల): నాలుగు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కారం చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలో కృష్ణానది సమీపంలో ఉన్న చెవిటికల్లు గ్రామంలో లక్ష్మయ్య వాగుపై వంతెన నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో లక్ష్మయ్య వాగు పొంగిపొర్లుతోందని, దీంతో ఆ వాగు ద్వారా ప్రయాణం సాగించే చెవిటికల్లు, మున్నలూరు, కునికెనపాడు, గనిఆత్కూరు, కొత్తపేట గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. కీసర నేషనల్ హైవే నుంచి తిరిగి దొనబండ నేషనల్ హైవే వరకు ఆర్ అండ్‌బీ రోడ్డు ఉందని అయితే వాహనదారులు, ప్రయాణికులు ఇదే రోడ్డులో ఈ వాగు ద్వారానే ప్రయాణిస్తుంటారని వాగు పొంగి పొర్లటంతో రాకపోకలు నిలిచిపోయేవని గుర్తుచేశారు. చిన్నపాటి వర్షం కురిసినా లక్ష్మయ్య వాగు పొంగుతుండేదని, గతంలో కూడా ఈ వాగు దాటే క్రమంలో ఓ చిన్నారి మృత్యువాత పడిందని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు.

ఐదు గ్రామాల సమస్యను గాలికొదిలేసిన టీడీపీ ప్రభుత్వం

మండలంలోని చెవిటికల్లు లక్ష్మయ్య వాగు ద్వారా ఐదు గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కంచికచర్ల, నియోజకవర్గ కేంద్రమైన నందిగామకు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. అయితే వర్షాకాలంలో లక్ష్మయ్య వాగు పొంగి పొర్లటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత పాలకులు ఈ వాగుపై ఎటువంటి కల్వర్టు కాని, చిన్నపాటి బ్రిడ్జిని ఏర్పాటు చేయకపోవటంతో ప్రయాణికులు నానా యాతన పడ్డారన్నారు. 25 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలన చేసిన టీడీపీ గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి చేయకపోగా వచ్చిన నిధులను ఆ పార్టీ నాయకులు దోచుకున్నారని ఆరోపించారు.

బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.5 కోట్లు మంజూరు

చిన్నపాటి వర్షం కురిసినా లక్ష్మయ్య వాగు పొంగటంతో ఐదు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయని ప్రజలు తమ దృష్టికి అనేకసార్లు తీసుకువచ్చారన్నారు. ఈ విషయం గురించి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లానని, ఆయన వెంటనే బ్రిడ్జి నిర్మాణపనులకు రూ.1.5 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తామని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు, వైఎస్సార్‌సీపీ కంచికచర్ల పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, నందిగామ ఏఎంసీ చైర్మన్ మస్తాన్, నాయకులు చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, వెలగలేటి బాబు, వాసు, కునికెనపాడు సర్పంచి సత్యనారాయణ, షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షహనాజ్ బేగం, ఎంపీడీఓ బాలశంకరరావు, తహసీల్దార్ శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానంతో పాటు వినోదం అందించే వేసవి శిబిరం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: గ్రంథాలయాలలో వినోదంతో పాటు విజ్ఞానం అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వినియోగంతో కనుమరుగవుతున్న పుస్తక పఠనం సమ్మర్ క్యాంప్‌ల పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలతో పూర్వ ఆదరణను సంతరించుకుంటుందన్నారు. గ్రంథాలయాలలో వేసవి శిబిరాల్లో పలు రకాల విజ్ఞాన, వినోద కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. ప్రతి రోజు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ శిబిరంలో లిజనింగ్ స్కిల్స్, పుస్తక పఠనం, బుక్ రివ్యూ తదితర కార్యక్రమాలను నిర్వహించాలని గ్రంథాలయ అధికారికి సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, గ్రంథాలయ అధికారి మస్తాన్ వలి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ ప్రభాకర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: నేటి ఆధునిక దేవాలయాలుగా పిలిచే గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ వారి ఆదేశాల మేరకు పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో జూన్ 11 వ తేదీ వరకు జరగనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల రోజులకు పైగా నిర్వహించనున్న విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు చక్కగా ఉపయోగించుకోవాలని తెలిపారు. వేసవి సెలవుల్లో తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా విజ్ఞాన శిబిరానికి వచ్చి అనేక కొత్త విషయాలను తెలుసుకోవడం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, తెలుగు దస్తూరి తదితర అంశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, తెలుగు, గణిత ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, ప్రసాద్, వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలకు సైతం నాణ్యమైన వైద్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చెవిటికల్లులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని చెవిటికల్లులో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న సింగంశెట్టి లక్ష్మీమోహనరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.70 లక్షల చెక్కును సోమవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు, వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుడ్డి సత్యనారాయణ, వెలగలేటి బాబు, వాసు, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, వేల్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడే హజరత్‌ను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చాన్‌బహదూర్, నాయకులు షేక్ పీర్‌సామియా, ఎంఎఫ్, షేక్ గౌస్‌పాషా, అబ్దుల్‌కరీం తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్



నందిగామ: చిరు వ్యాపారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఫ్రూట్ మార్కెట్‌లోనే వ్యాపారాలు చేసుకోవాలని సీఐ సతీష్ చిరు వ్యాపారులకు సూచించారు. పట్టణంలోని మెయిన్ బజార్, పరిసర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తోపుడు బండ్ల వ్యాపారులు పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మార్కెట్‌లో కేటాయించిన ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు.

12న మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల: ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటల నుంచి కంచికచర్ల మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు సోమవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, విధిగా పాల్గొనాలని కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరుకావాలని, ఆ సమాచారాన్ని ఒకరోజు ముందుగా తమకు నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు ఈకేవైసీ చేయించుకోవాలి



కంచికచర్ల: విశ్రాంత ఉద్యోగులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ట్రెజరీ అకౌంట్ అధికారి ఎంహెచ్ రహమాన్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక ఉప ఖజానా కార్యాలయాన్ని సందర్శించారు. హెల్త్ కార్డుల గురించి చర్చించారు. అనంతరం ఎస్టీఓ ఎం.కృష్ణారావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి సీహెచ్ నాగేశ్వరరావు ఆయన్ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ బాలశంకరరావు

కంచికచర్ల: వేసవి విరామాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.బాలశంకరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు వేసవి విజ్ఞాన సదస్సులు జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సుల్లో కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుట, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా ఈ కార్యక్రమాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కంచికచర్ల, పరిటాల సర్పంచులు వేల్పుల సునీత, యద్దనపూడి ఆనందజ్యోత్స్న, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, యద్దనపూడి విజయారావు, జల్లి కారల్‌మార్క్స్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంతో రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సచివాలయంలో రీ సర్వే జరుగుతున్న గూడెంమాధవరం, పెద్దాపురం, జయంతి, వీరులపాడు, చౌటపల్లి, చట్టన్నవరం, దాచవరం, చెన్నారావుపాలెం, బోడవాడ, జగన్నాథపురం, నరసింహారావుపాలెం, పెద్దాపురం గ్రామాల రెవెన్యూ, సర్వే సిబ్బందితో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే సిబ్బంది నిష్పక్షపాతంగా సర్వే చేసేలా చూడాలన్నారు. ముఖ్యంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేయించాలని తెలిపారు. రైతులు ఏవైనా అభ్యంతరాలు పెడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదు

మున్సిపల్ కమిషనర్ జయరాం



ట్రావెలర్స్ బంగళా రోడ్‌లో ఉన్న మేజర్ సైడ్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: పారిశుద్ధ్య సిబ్బంది పట్టణ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని 3, 4 వార్డులను కలుపుతూ ఉన్న మేజర్ సైడ్ డ్రైన్ ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. సైడ్ డ్రైన్‌పై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వెంటనే మరమ్మతులు చేయించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా అవార్డుల పరిధిలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. పారిశుద్ధ్య విషయంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట మూడవ వార్డు కౌన్సిలర్ షేక్ ఖాలిక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

2500 మందికి మజ్జిగ పంపిణీ



పేట మున్సిపల్ కూడలిలో ఆయుర్వేద మజ్జిగ పంపిణీ చేస్తున్న పద్మశాలీ సంఘం ప్రతినిధులు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన ఆయుర్వేద మజ్జిగ పంపిణీ కార్యక్రమం సోమవారం 16 వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి మాట్లాడుతూ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ ఆయుర్వేద మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సోమవారం సుమారు 2,500 మందికి చల్లని ఆయుర్వేద మజ్జిగ పంపిణీ చేశామని, తొలకరి వర్షాలు పడి వాతావరణంలో మార్పు వచ్చేంత వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు ఏశ్యాల సీతారామమూర్తి, భారత జగన్, అల్లి రవిచంద్, లక్ష్మీ కిషోర్, యలదండి శ్రీనివాస్, బొట్ల వీరభద్రం, పొట్టాబత్తిన రఘు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ శేషుకుమార్



డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్‌ను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఉమ్మడి కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షుడిగా మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ నియమితులయ్యారని సంస్థ జాతీయ విభాగం కార్యదర్శి డాక్టర్ వి.ఉమా సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో జరిగిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రతినిధుల ప్లీనరీ సమావేశాల్లో సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతులమీదుగా కేఆర్‌జీ శేషుకుమార్‌కు నియామక పత్రం అందజేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షుడిగా నియమితులైన శేషుకుమార్‌ను జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమనాయుడు, సంస్థ ప్రతినిధులు ఈశ్వరీ భూషణ్, జిల్లా అధ్యక్షుడు జూపూడి రామకృష్ణ, రొంపిచర్ల ఉదయకిరణ్ యువజన విభాగం ప్రతినిధులు తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో విశాల్ సత్తా

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల 100 మీటర్ల రన్నింగ్ పోటీల్లో విజయవాడ క్రీడాకారుడు వి.కె.విశాల్ సత్తా చాటాడు. నాగార్జున విశ్వవిద్యాలయం సింథటిక్ ట్రాక్‌పై ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల ఐదో తేదీన జరిగిన పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. విశాల్ నలంద డిగ్రీ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ సందర్భంగా విశాల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, పీడీ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం అభినందించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ పాత్ర మరువలేనిది



పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సామాజిక సేవలకు ఆద్యుడైన జాన్ హెన్రీ డూన్ హంట్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రెడ్‌క్రాస్‌తో కలిసి సమాజసేవలో భాగస్వాములు కావాలని కోరారు. కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం నిర్వహించారు. తొలుత అంతర్జాతీయ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీ డూన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాన్ హెన్రీ డూన్ హంట్ 300 సంవత్సరాల క్రితమే సామాజిక సేవలకు శ్రీకారం చుట్టారన్నారు. యుద్ధరంగంలో ప్రాణాలు పోయిన వారు, క్షతగాత్రులుగా మారిన వారి పరిస్థితిని గమనించిన ఆయనకు సేవ చేయాలనే ఆలోచన మదిలోకి వచ్చిందన్నారు. ఆయన ఆలోచనలకు కార్యరూపమే నేటి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అని పేర్కొన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు సమయంలో బాధితులను ఆదుకుని ఆసరా కల్పించడం, రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ పరంగా పేదలకు ఆర్థిక చేయూతను అందించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాత్ర మరువలేనిదని కొనియాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం ప్రపంచంలో అన్ని సేవా సంస్థల్లో రెడ్ క్రాస్‌కి అందిన విరాళాలల్లో 90 శాతం సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. నాలుగు సార్లు నోబుల్ బహుమతి పొందిన ఏకైక సంస్థ ఇండియన్ రెడ్ క్రాస్ మాత్రమేనన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.సమరం సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు హైజీన్ కిట్లను పంపిణీ చేశారు. డీఆర్వో కె. మోహన్ కుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డాక్టర్ రవి, రెడ్ క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు డిఎస్ ఎస్ బాలసుబ్రమణ్యం, అసిస్టెంట్ మేనేజర్ పి. సునీత, వివిధ శాఖల అధికారులు, రెడ్ క్రాస్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారి వర్ధినీకుమారి

మక్కపేట(వత్సవాయి): షేడ్‌నెట్ మిర్చి నర్సరీ నిర్వాహకులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని, నారును పెంచాలని ఉద్యానశాఖాధికారి వర్ధినీకుమారి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో సోమవారం నర్సరీ నిర్వాహకులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చుట్టూ ఇన్‌సెక్ట్ నెట్ ఉండేలా చూసుకోవడం, షేడ్‌నెట్‌కు మూడు అడుగుల విస్తీర్ణం వరకు ఎటువంటి కలుపు, చెట్లు ఉండకుండా చూడడం, నర్సరీకి చెందిన ఏడు రిజిస్టర్లలో పూర్తి వివరాలు నమోదు చేయడం, నర్సరీ లైసెన్సు నంబర్, ప్రింటింగ్ బిల్లులు మాత్రమే నారు కొనుగోలుదారులకు అందించడం, నర్సరీ లోపల వైరస్‌లు నివారణకు చుట్టూరా బంతి మొక్కలు నాటుకోవడం, నర్సరీ పేరును సూచిస్తూ బోర్డును ఏర్పాటుచేయడం వంటివి తప్పక పాటించాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com